

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

## చలే పవన్ కీ చాల్, జగ్‌మే చలే పవన్ కీ చాల్

1941లో విడుదలయిన ‘డాక్టర్’ సినిమా ప్రయాణపు పాటలకు నాందీ ప్రస్తావన చేసిన సినిమాగా భావించవచ్చు. భవిష్యత్తులో రూపొందిన అనేక ట్రావెల్ పాటలకు మార్గదర్శనం చేసిన రెండు పాటలు ఈ సినిమాలో ఉన్నాయి. డాక్టర్ సినిమా 'పంకజ్ మల్లిక్' ప్రతిభ విరాట్ ప్రదర్శనలాంటి సినిమా. నటుడిగా, సంగీత దర్శకుడిగా గాయకుడిగా సినిమా అంతా తానే అయి అలరిస్తాడు పంకజ్ మల్లిక్.

'డాక్టర్' ఆ కాలం నాటి సమాజంలో వేళ్లూనుకుంటున్న ఆదర్శ భావనలను అత్యంత ప్రతిభావంతమైన రీతిలో ప్రదర్శిస్తుంది. ఆనాటి సమాజాన్ని పట్టి పీడిస్తున్న అనేక సమస్యలను ఎత్తి చూపి పరిష్కారాలు సూచిస్తుంది.

స్వాతంత్ర పోరాటంలో 'మేము సైతం' అన్నారు తమ సినిమాల ద్వారా కళాఅకారులు. అలాంటి సినిమా ‘డాక్టర్.’

డాక్టర్ సినిమా అప్పటి పరిస్థితులను చక్కగా ప్రతిబింబిస్తుంది. ఓ జమిందారు తండ్రి. పాత సాంప్రదాయాలను పాటించేవాడు. ఆదర్శవంతుడయిన కొడుకు. ఆదర్శం కోసం అన్నిటినీ వదులుకుంటాడు. పేదింటి పిల్లను పెళ్లి చేసుకుంటాడు. కొడుకుకు జన్మనిస్తూ ఆమె మరణిస్తుంది. అప్పుడు అనాధలా తన పిల్లవాడిని తండ్రి దగ్గర పెంచుతాడు. పిల్లవాడు పెరిగి పెద్దవాడయినప్పుడు అతడు తన మనుమడే అని తాతకు తెలుస్తుంది. ఇక్కడా మనుమడి వివాహం తాతకూ మనమడికీ నడుమ ఘర్షణ కలిగిస్తుంది. చివరికి కథ సుఖాంతం అవుతుంది. ఈలోగా డబ్బు ఉండటం గొప్పకాదు దాన్ని ఇతరులాభివృద్ధికి వినియోగించటంలోనే గొప్పతనం ఉందన్న ఆదర్శం సినిమా బోధిస్తుంది. పేద ప్రజల సేవలో తండ్రీ కొడుకులు, తాత జీవితాన్ని అంకితం చేస్తారు. టూకీగా ఇదీ డాక్టర్ సినిమా కథ.

ఈ సినిమాలో రెండు అత్యద్భుతమైన ప్రయాణపు పాటలున్నాయి. దాన్లో ఒకటి 'చలే పవన్ కీ చాల్, జగ్‌మే చలే పవన్‌కీ చాల్' తరువాత అనేక సినిమాలు ఈ పాటను, సందర్భాన్నీ, భావాన్నీ అనుకరించాయి. అనుసరించాయి. ముఖ్యంగా ఈ పాట నేపథ్యంలో వినిపించే గుర్రపు డెక్కల చప్పుడు లయను తరువార ఓ.పి.నయ్యర్ తన 'సంతకం' చేసుకున్నాడు.

నాయకుడు గుర్రపు బండి ఎక్కుతాడు. బండి పరుగు ఆరంభిస్తుంది. నాయకుడి హృదయం పాటపాడుతుంది పెదవులపై రాగం నర్తనమాడుతుంది. నాయకుడి ఆదర్శం, వ్యక్తిత్వం పాటలో వ్యక్తమవుతుంది.

**చలే పవన్ కీ చాల్, జగ్‌మే చలే పవన్‌కీ చాల్**

**యహీ చాల్ హై జగ్ సేవా కా యహీ జీవన్ సుఖపాల్**

వాయు గమనంతో వెళ్తోంది ప్రపంచం వాయుగమనంతో నడుస్తోంది. ఈ ప్రపంచ గతి సేవ. ఇదే జీవిత సాఫల్యం. ఇతరులకు సేవచేయటంలోనే వ్యక్తి జీవితానికి అర్ధం, పరమార్ధం ఉన్నాయన్నమాట. ఇది జగతి గతి.

పేదప్రజలకు సేవ చేయటం కోసం నాయకుడు ఐశ్వర్యాన్ని వదులుకుంటూ సౌఖ్యాలను త్యాగం చేస్తాడు. తండ్రికి దూరం అవుతాడు. కానీ అతడికి విచారం లేదు. కష్టాలలో ఉన్న వారిని ఆదుకుంటున్నానన్న విశ్వాసం అతడి ఆనందం. పేదప్రజలకు వైద్యం అందిస్తూ వారి ప్రాణాలను కాపాడుతున్నానన్న ఆనందం అతడి సౌఖ్యం, ఐశ్వర్యం. అందుకే 'యహీ చాల్ హై జగ్ సేవాకా' అంటున్నాడు కవి. 'సేవా ప్రపంచం గతి ఇదే'

ఇస్ నగరీకే డగర్  డగర్  మే

లాఖో హై జంజాల్

సఖ్తీ , నర్మీ  సర్దీ  గర్మీ

ఏక్ సాంచే మే డాల్

హో చలే పవన్ కీ చాల్…

ఈ ప్రపంచంలో అడుగడుగునా లక్షల సంఖ్యలో దుఃఖాలు, కష్టాలు ఉన్నాయి. కఠినమైనదయినా, మృదువైనవయినా, చల్లనివయినా, వేడివయినా, అన్నిటినీ సమానంగా స్వీకరించాలి. పవన వేగంతో ముందుకు సాగాలి.

నాయకుడు అన్ని ఐశ్వర్యాలను, సౌఖ్యాలను త్యజించాడు. ఇపుడు అతడికి దుఃఖం అన్నదే లేదు. దేన్నయినా సమానంగా స్వీకరిస్తాడు. అతడి పథం సేవాపథం. ఆ ఆనందం అనంతమైనది. ప్రపంచంలోని పలువేదనలను తొలగించటంలో తన వంతు బాధ్యతను నిర్వహిస్తాడు. ఇదీ చరణం సారాంశం. పాట పాడేటప్పుడు నాయకుడి వదనంలో ప్రతిఫలించే ఆనందం పాటను మరింత చేరువ చేస్తుంది. నాయకుడి పాత్రపై అనురాగం కలిగిస్తుంది. పాట చిత్రీకరణలో కూడా చమత్కారం ఉంది. గుర్రపు బండి, పక్కనే ఉన్న నారో గేజ్ రైల్వే లైనుకు సమాంతరంగా పరుగిడుతూంటుంది. అంటే, అతను తాను ఎంచుకున్న ఆదర్శపు దారిలో వేగంగా ప్రయాణిస్తూ ముందుకు సాగుతున్నాడన్నమాట. ఈ దృశ్యం చూస్తూంటే ఒక భావన కలుగుతుంది. ఇప్పుడు గుర్రపు బండీలు లేవు. నారోగేజ్ రైళ్లు లేవు, రైల్వే లైనూ లేదు. ఆ మనుషుల్లో ఆ ఆదర్శం లేదు. పాటల్లో ఆ రాగం లేదు. ఆ భావం లేదు. పదాలలో ఆ స్వచ్ఛత లేదు. ఆ సారళ్యం లేదు. ఉన్నవి కదిలే బొమ్మలు, అదరగొట్టే పాటలు, బెదిరించే యుద్ధాలు..

దుఖ్ కా నషా హో  సుఖ్ కా పాలన్

దోనో చీర్ఘొ సంభాల్

చుభ్‌తే కాంటే పిస్ పిస్ జాయే

ఫూల్ న హో పామాల్

కట్‌న సకే యే లంబా రాస్తా

కటే హజారో సాల్

జహాపహుంచ్  నే పర్ దం టూటే

హై వహీ కాల్ అకాల్

చలే పవన్ కీ చాల్..

అద్భుతం అనిపిస్తుంది. అతడికి దుఃఖం పట్ల మక్కువ. దుఃఖం అంటే దూరం పారిపోవటం లేదు. సుఖం అంటే మక్కువ లేదు. రెంటినీ సమానంగా చూడాలి. రెండింటి బరువునూ మోయాలి. జీవితంలో సుఖం దుఃఖం రెండూ రెండు విడదీయరాని అంశాలు. ఒకటి కావాలి, మరొకటి వద్దంటే కుదరదు. కాబట్టి రెండింటినీ సమానంగా భరించాల్సిందే. అందుకే 'దోనో బోర్ఝ్ సంభాల్' అంటున్నాడు కవి. పూలు దెబ్బతినకూడదు. కాబట్టి ముళ్లు గుచ్చుకుని గుచ్చుకుని అవే విరిగిపోవాలి. ముళ్లను పట్టించుకోకూడదు. పూలను కాపాడాలి. ఇదొక సుదీర్ఘ ప్రయాణం. ముళ్లు అంత త్వరగా కరిగిపోవు. కాబట్టి వెయ్యేళ్లయినా ఈ సుదీర్ఘ ప్రయాణం చేస్తూండాలి. ఈ ప్రయాణంలో ప్రాణం పోయినా ఫరవాలేదు. చివరి వాక్యంలో 'కాల్ అకాల్' అన్న పదాన్ని అతి సుందరంగా వాడాడు కవి. 'కాల్' అన్నది మరణాన్ని సూచిస్తుంది. అకాల్ అన్నది అనంతాన్ని సూచిస్తుంది. ఏ గమ్యం కోసమై ఈ సుదీర్ఘ ప్రయాణం చేస్తున్నాడో ఆ ప్రయాణంలో మరణం సంభవించినా వ్యక్తి

చిరంజీవి అవుతాడు. కాబట్టి పవన వేగంతో ముందుకు సాగాలి. ఎలాంటి కష్టాలు, నష్టాలు ఎదురయినా అన్నిటినీ, చిరునవ్వుతో భరిస్తూ ముందుకు సాగాలి. ఇదీ నాయకుడు తన ఆదర్శాన్ని ప్రపంచానికి అందించే పాట. పాటను వింటూనే పాటను ప్రేమించటం ఆరంభిస్తాం. రవీంద్ర సంగీతంలోని మాధుర్యాన్ని సినీ పాటల ద్వారా ప్రపంచానికి మరింత చేరువ చేసిన 'పంకజ్ మల్లిక్' ప్రేమలో పడతాం. ఎటువంటి నాటకీకరణ స్వరంలో లేకుండానే అనేకమైన భావాలను అవలీలగా పలికే అతని స్వరాన్ని ప్రేమించటం ప్రారంభిస్తాం. ఎలాంటి వాయిద్యాల పటాటోపాలు లేకుండా అత్యంత సరళంగా, తరళంగా పాటను రూపొందించిన అతని ప్రతిభతో ప్రేమలో పడతాం. ముఖ్యంగా, పాటలో పదాలు, భావం ఎంత సరళంగా ఉన్నాయో, అంత సమానంగా బాణీని రూపొందించి పాటను మలచిన తీరుకు ఆశ్చర్యపోతూ ఆనాటి కళాకారుల ప్రతిభకు జోహార్లర్పిస్తాం. భావితరాల ముందు ఉత్తమ ఆదర్శాన్ని అత్యుత్తమ రీతిలో ప్రదర్శించాలన్న వారి తపనకు వందనాలు అర్పిస్తాం.

ఇక్కడే మరో విషయం ఉంది. ఈ పాట వింటూ ఎంతగా ఆనందలోకపు అంచులవరకూ అవలీలగా ప్రయాణిస్తామో, ఇదే సినిమాలోని మరో ప్రయాణపు పాట 'ఆయీ బహార్ ఆజ్ ఆయీ బహార్' పాటను అంతకన్నా అధికంగా ఆనందపు లోకాలన్నిటిలోకి అవలీలగా పవన వేగంతో ప్రయాణిస్తాం.

**ఆహాహా, ఆయీ బహార్ ఆజ్ ఆయీ బహార్**

రైలులో ప్రయాణిస్తూ పాడే పాట. రైలు కంపార్ట్‌మెంట్ తలుపు కడ్డీని పట్టుకుని వ్రేలాడుతూ పాడేపాట. రైలు వేగంగా ప్రయాణిస్తూంటే, అంతకన్నా వేగంతో వీస్తున్న గాలి శరీరాన్ని తాకుతూ ఏవేవో లోకాలకు ఎగరేసుకుని పోతూంటే మనసు ఉప్పొంగి పాడే మధురమైన ఆనందగీతిక ఈ పాట. రైలు ప్రయాణంలో దారిలో కనిపించే ప్రకృతి దృశ్యాలను, పల్లె ప్రజలను చూస్తూ మైమరచి మధురోహల ఆకాశంలో ఆనందంగా విహరిస్తూ ఎదలోతులను చీల్చుకుని పైకి ఎగసే హర్షాతిరేకపు కేక ఈ పాట.

'ఆహాహా' అంటూ పాట ఆరంభించగానే 'ఆహా' అన్న శబ్దం లోలోతుల్లోంచి అప్రయత్నంగా వెలువడుతుంది. ఏమి స్వరం అది. పంకజ్ మల్లిక్ పాట విన్న తరువాత అతని స్వరం విన్న తరువాత మరో స్వర ప్రకంపనలు చెవులలో ప్రవేశించటమన్న భావననే భరించటం కష్టం. ఒక స్వచ్ఛమైన పర్వతాన్ని చూసిన తరువాత, స్వచ్ఛమైన నదీప్రవాహ జలాల పవిత్రతను అనుభవించిన తరువాత మిగతావన్నీ ఎలా మనసును తాకలేవో అలా మిగతావన్నీ మనసు పైపై పొరలను కూడా స్పందించలేకపోతాయి. అది పంకజ్ మల్లిక్ గొప్పతనం. ఎలాగయితే సీతాదేవి స్పర్శతో శ్రీరామ చంద్రుడి శరీరం సర్వం అచేతనమైనా మనసు సచేతనమై అత్యంత తీవ్రమైన సౌఖ్య భావనను అనుభవించిందో అలాంటి శరీరం నిశ్చేష్ట అయిన చైతన్యవంతమైన స్థితిని అనుభవానికి తెస్తుంది పంకజ్ మల్లిక్ పాట.

**అహాహా**

**ఆయీ బహార్, ఆజ్ ఆయీ బహార్**

**గుల్షన్ మే**

**గుల్షన్ మే లియే పూలోంకే హార్**

**ఆయీ బహార్, ఆజ్ ఆయీ బహార్**

పాటలోని పదాలు చాలా సులువైనవి. పాట రచయిత ఆర్జూ లఖ్నవి. ఆర్జూ లఖ్నవి ప్రసిద్ధ ఉర్దూ కవి. ఆయన ప్రత్యేకత ఏమిటంటే, రాసినది ఉర్దూ కవితలే అయినా ఉర్దూపైన అరబిక్, పర్షియన్ ప్రభావాన్ని తగ్గించి వీలైనంత సరళమైన పదాలతో కవిత రచించేవాడు. అర్జూ లఖ్నవి . ఆ కాలంలో సూపర్ హిట్ పాటలు రచించాడు ఆర్జూ లఖ్నవి.

హీరో ఆదర్శవంతుడు. స్నేహితులతో రైలులో ప్రయాణం చేస్తూంటాడు. భవిష్యత్తుపై అనేక ఆశలుంటాయి. అప్పుడే జీవిత ప్రయాణం ఆరంభమవుతోంది. అత్యంత ఉత్సాహంతో ఉంటాడు. దీనికి కాస్త రొమాంటిక్ భావాలూ తోడవుతాయి. ఆ ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని, ఆశను, రొమాన్స్‌నూ అన్నిటినీ కలగలిపి పాటలో పొందు పరిచాడు ఆర్జూ లఖ్నవి.

యవ్వనంలో ప్రపంచమంతా వసంతం వచ్చినట్టనిపిస్తుంది. ఆ భావననే పాట ఆరంభంలోనే ప్రదర్శించాడు కవి. తోటలన్నీ పూలహారాలతో నిండి ఉన్నాయట. పూల హారాలు తీసుకుని వసంతం వచ్చిందంటోంది పల్లవి.

పాట చిత్రీకరణలో ఓ చమత్కారం చేశారు. ఓ చెట్టు కొమ్మపై కూర్చుని పిల్లవాడు వేణువు వాయిస్తూంటాడు. అది ప్రిల్యూడ్ సంగీతం. సినిమా ఆరంభం పాటతోటే. నాయకుడి పరిచయం  పాట అన్నమాట. వేణువు వాయిస్తున్న పిల్లవాడు 'ఆహా ' అన్న ఆలాపన వినబడగానే ఉలిక్కిపడి ఆ వైపు చూస్తాడు. రైలు డబ్బా కడ్డీ పట్టుకుని వేలాడుతూ నాయకుడు పాట పాడుతూంటాడు.

మేరే దిల్ మే భి తాజా ఉమంగే బడీ
ఆర్జూయే బఢీ ఔర్ కైసీ బఢీ
లియే పూలోంకి హార్
ఆయీ బహార్ ఆజ్ ఆయీ బహార్.

నాయకుడి హృదయంలో కొత్త కోరికలు, ఆశలు ఊపందుకుంటున్నాయి. ఎలా అంటే పూలహారంతో వసంతం వచ్చిన రీతిలో అతని కోరికలు వినిపిస్తున్నాయన్నమాట.

మస్తీ సె డాలీ జొ యూ ఝూం ఉఠీ
ఇస్ మస్త్ సె ఇన్‌కే ఆంఖే లడీ
ఆజ్ హర్ ఫూల్ పర్ హై నయీ తాజ్ గీ
రంగ్ చూకా అనోఖా హై ఖుష్బూ  నయీ
అందలీబే  పువారీ జ్యూ హీ యె సునా
లియే పూలోమె హార్, ఆయీ బహార్

రైలు నడుస్తూంటుంది. రైలుకి ఇరువైపులా ఆనాటి పల్లె వాతావరణం కనిపిస్తూంటుంది. అప్పటి వాతావరణం తెలుస్తూంటుంది. ఇంతలో పల్లె పడుచులు పూలుతో వస్తూ కనిపిస్తారు ప్రతి కొమ్మా సంతోషంతో నృత్యం చేస్తోంది. ఈ సమయంలో ఆమెతో కళ్లు కలిశాయి. ప్రతి పూవు కొత్తదనంతో కలకలలాడుతోంది. వింత రంగుతో, పరిమళంతో ప్రతిపూవూ భాసిస్తోంది. 'అందలీబే' అన్నది అరబిక్ పదం. ఇది కోకిలలా కూసే పక్షి. వసంతం వచ్చింది కాబట్టి కోకిల కూస్తుంది. కోకిల పిలుపు విన్నాడట. ఇలాంటి వసంతం వచ్చింది.

ఆజ్ ఫూలో కా  బుల్ సె బ్యా హోనె కొహై
ఆజ్ ఢాలోంమె చందన్ ఆనేకాహై
ఆవో షాదీ రచాయే షోర్ హం సబ్  నయే
హై యే షాదీ నయీ
ఆవో దునియా బదల్నేక దిన్ ఆగయా
లియా పూలోంకె హార్, ఆయీ బహార్.

పూవుకూ కోకిలకూ వివాహం అవుతోందట. సరికొత్త పాటలు పాడాలి. కథలు చెప్పాలి. అందరూ కలసి పాటలు పాడాలి. నృత్యాలు చేయాలి ఆ వివాహంలో. సరికొత్త వివాహం ఇది. ప్రపంచాన్ని మార్చే సమయం ఇదే. ఎందుకంటే కొత్త రుతువు వచ్చింది. సరికొత్త మార్పులను తెస్తోంది ఈ మార్పులను ఆహ్వానిస్తూ పూలమాలలతో వసంతం వచ్చింది.

హీరో ఆదర్శాన్ని, సమాజంలో మార్పుకు కారకులయ్యే యువత ఆదర్శాన్నీ 'ఉందిలే మంచికాలం ముందు ముందున' అన్న భావాల్ని అత్యద్భుతంగా కవితలో ప్రతిఫలించాడు ఆర్జ్యులఖ్నవీ. భారతీయ సినిమాలలో తొలి రైలు పాట ఇదే. భవిష్యత్తులో రాబోయే అనేక హిట్ పాటలకు నాందీ ప్రస్తావన ఈ పాట.

ఆనాటి కళాకారులకు సినిమా తమ ఆదర్శాలను, ఆలోచనలను సమాజంలో విస్తరించేందుకు అనువైన సాధనం. తమ ఆవేశాలను, ఆశలను భవిష్యత్ తరాలకు అందించే మాధ్యమం. సమాజ అభ్యున్నతికి బీజాలను ప్రజల మెదళ్లలో నాటేందుకు ఒక వేదిక. అందుకే ఆనాటి సినిమాలు, పాటలు ఈనాటికీ ప్రజల్ను అలరిస్తున్నాయి. ఆనందింప చేస్తున్నాయి. ఆలోచింపచేస్తున్నాయి. భవిష్యత్తుపై ఆశాభావాన్ని కలిగిస్తూ మార్గదర్శనం చేస్తున్నాయి. ఆనాటి కళాకారుల కళాప్రతిభకు, వ్యక్తిత్వానికీ తార్కాణంగా నిలుస్తున్నాయి ఈ పాటలు. ఈనాటికీ మనస్సులను పరిమళభరితం చేస్తున్నాయి.

(మరిన్ని పాటలు వచ్చే నెలలో)

Post your comments